రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.35	ఉ. 4.42

అల్లాహ్ ఒక దాసుడిని ప్రియతమునిగా చేసుకున్నప్పుడు అతనికి మృధు స్వభావాన్ని ప్రసాదిస్తాడు





సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు



వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రైతుదీక్ష చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

రైతు చుట్టూ రాజకీయం

- కాంగ్రెస్ రైతు హామీలను విస్మరించిందంటూ ప్రతిపక్షాల పోరుబాట
- నిరసన దీక్షకు దిగిన బీఆర్ఎస్
- రైతులకు బోనస్, నష్టపరిహారం ఇవ్వాలంటూ డిమాండ్
- రైతులకు మద్దతుగా బీజేపీ సత్యాగ్రహ దీక్ష
- పంట పరిహారం, రైతుబీమా ఇవ్వాలంటూ రైతుల పక్షాన ఆందోళన
- ఎన్నికల వేళ రైతు ఓట్లను ఆకర్షించేందుకు ప్రతిపక్షాల ప్రయత్నం
- ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతున్న కాంగ్రెస్

కామారెడ్డి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జిల్లాలోనూ రైతు చుట్టూ రాజకీయం నెలకొంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతుండడం, వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతినడం, పంటల ఉత్పత్తులకు బోనస్ ఇవ్వాలంటూ, రైతుబంధు నగదు వేయాలంటూ పంట నష్టపరిహారం ఇవ్వాలంటూ ఓ వైపు ప్రతిపక్షాలు ఆందోళనబాట పట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా నిరసన దీక్షలు చేపట్టాయి. అంతకుముందే బీజేపీ సత్యాగ్రహ దీక్షలు నిర్వహించి రైతులకు మద్దతుగా నిలిచాయి. ప్రతిపక్షాల ఆరోపణలను విమర్శలను కాంగ్రెస్ తిప్పికొడుతూ తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకొస్తోంది. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ పక్షాలు రైతురాగం వినిపిస్తున్నాయి. రైతుల ఓట్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీలు రైతు సమస్యలను లేవనెత్తుతూ ఆందోళనబాట పట్టాయి. ఇలా జిల్లాలో ఓ వైపు ప్రధాన ప్రతిపక్షాలు రైతుకు మద్దతుగా ఆందోళన చేపడుతు ఒడడంతో రైతు చుట్టూ రాజకీయం నెలకొంటుంది.

కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ బీఆర్ఎస్ ఆందోళన బాట

ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటలకు సాగు నీరు కొరత తీవ్రంగా ఉంది. ఐదెకరాల రైతులకు కూడా రైతు బంధు అందకపోవడం, రూ.2లక్షల రుణమాఫీ, అకాల వర్షాలతో నష్టపోయిన పంటకు ఇంకా పరిహారం రాకపోవడాన్ని బీఆర్ఎస్ తమ అస్త్రాలుగా అందిపుచ్చుకుని అధికార పక్షంపై విరుచుకుపడుతున్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ బీఆర్ఎస్ నేతలు పొలంబాట పట్టారు. ఇటీవల రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయా ప్రాంతాల్లో నేతలు పరిశీలించి రైతులను పరామర్శించారు. అదేవిధంగా పంట నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల పంటలకు బోనస్ ఇవ్వాలంటూ కలెక్టరేట్‌ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు ధర్నాలు చేపట్టడమే కాకుండా జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రం అందించారు. శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, సురేందర్, హన్మంత్‌షిండేలు పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గాల వారీగా పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లోనూ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు హాజరై రైతు సమస్యలే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతుబంధు సహాయం ఇప్పటికే రైతుల ఖాతాలో జమకాలేదని రూ.2లక్షల రుణమాఫీని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి అమలు నుంచి తప్పించుకుంటుందని వారు విమర్శించారు. ఇలా బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రైతుల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శిస్తూ రైతులకు మద్దతుగా ఆందోళన చేపడుతోంది. ఇక రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టారు.

బీజేపీ సత్యాగ్రహ దీక్ష

పంట పొలాలకు సాగునీరు అందకుండా పోవడానికి ప్రణాళిక బద్ధంగా వ్యవహరించని ప్రభుత్వ తీరే కారణమని బీజేపీ ఆరోపిస్తూ రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. రెండ్రోజుల క్రితం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, అరుణతార, యెండల లక్ష్మీనారాయణలు సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ఇటీవల వడగండ్ల వానల వల్ల పంటలు నష్టపోయిన విషయంలో ప్రభుత్వం అధికారుల చేత క్షేత్రస్థాయిలో సరైన విధంగా సర్వే చేయలేదని నేతలు ఆరోపించారు. నష్టపోయిన పంటకి పరిహారం ప్రకటించినా ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అత్యవసర పరిస్థితి కింద రైతులకు పరిహారం చెల్లించవచ్చని సూచిస్తోంది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని గొప్పలు చెబుతున్నప్పటికీ రూ.2లక్షల రుణమాఫీ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. యాసంగి కొనుగోలు ప్రారంభమైనా రూ.500ల బోనస్ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇలా ఎన్నికల వేళ బీజేపీ రైతు సమస్యలపై దీక్షలు చేపడుతూ అన్నదాతకు మద్దతుగా నిలుస్తోంది.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతున్న కాంగ్రెస్

అధికార పక్షమైన కాంగ్రెస్ వంద రోజుల్లో తాము చేసిన పనులను వివరిస్తూ ప్రస్తుత కరువు పరిస్థితికి బీఆర్ఎస్సే కారణమని ఎదురుదాడి ప్రారంభించింది. ఐదెకరాల వరకు రైతుబంధు నిధులు విడుదల చేశామని రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెబుతూ మంత్రులు విపక్షాల ఆరోపణలను ఖండిస్తున్నారు. ఇటీవల వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతరావులు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలు పరిశీలించారు. రైతులకు అన్నివిధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో రైతుల మద్దతు కూడబెట్టుకోవడానికి అన్ని రాజకీయ పక్షాలు చేస్తున్న ప్రయత్నాలను గమనిస్తున్న రైతులు ఎవరి పక్షాన ఉంటారో అన్నది అంతటా చర్చనీయాంశంగా మారింది.



రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

రైతులను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని రైతుబంధు, రైతు బీమా ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. కానీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక రకాలుగా హామీలు ఇచ్చి గద్దెనెక్కి వారి సమస్యలను విస్మరిస్తుందని అన్నారు. రైతు బంధు రూ.15వేలు ఇస్తామని, వరికి మద్దతుగా బోనస్ రూ.500లు అందిస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. అధికారంలోకి రాగానే డిసెంబరు 9న రైతు రుణమాఫీ రూ.2లక్షలు చేస్తామని ఇప్పటి వరకు ఏ నిర్ణయం తీసుకోలేదని అన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానలకు రైతుల పంటలు నష్టపోతే ఎలాంటి సహాయం చేయలేదని వెంటనే ప్రతీ ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిప్పిరి అంజనేయులు, వేణుగోపాల్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, వెంకటి, బాలమణి, అశోక్, గైని శ్రీనివాస్‌గౌడ్, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, గెరిగంటి లక్ష్మీనారాయణ, కుంబాల రవి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

బాన్సువాడ, ఏప్రిల్ 6: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటు, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందించే సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో పారిశుద్య నిర్వహణ లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం రోగులకు భోజనం అందించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఏరియా ఆసుపత్రి భవనాన్ని కూల్చి వేసి నూతన భవన నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

షీ టీంపై అవగాహన

మద్నూర్, ఏప్రిల్ 6: మండలంలోని మేనూర్ ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాఠశాలలో బాలికలకు షీ టీంపై పోలీస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, రామేశ్వరి, రామకృష్ణ తదితరులున్నారు.

పురాతన కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలు

- నాగన్న బావిలో కలెక్టర్ శ్రమదానం

లింగంపేట, ఏప్రిల్ 6: పురాతన కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండల కేంద్రంలోని చారిత్రక కట్టడమైన నాగన్న బావిలో పూడికతీసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. నాగన్న బావిలో పూడిక తీయడం ద్వారా స్వచ్ఛమైన నీరు వస్తుందని, భూగర్భజలాలు పెరుగుతాయని ఆయన తెలియజేశారు. మండలంలోని అధికారులతో పాటు యువకులు శ్రమదానంలో పాల్గొనడం ద్వారా రెండు రోజుల్లో చేయాల్సిన పని రెండు గంటల్లో చేశామని ఆయన తెలియజేశారు. స్వచ్ఛంధ కార్యక్రమాల్లో యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. పూడిక తీసే పనిలో పాల్గొన్న యువకులను ఆయన అభినందించారు. త్వరలోనే నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఆయన తెలిపారు. బావి పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌లతో పాటు మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో పాటు యువకులు పాల్గొన్నారు.



లింగంపేటలో నాగన్నబావిలో పూడిక తీస్తున్న కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

తాడ్వాయి, ఏప్రిల్ 6: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని అక్కడ ఉన్న పరిస్థితిని బట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సాజిద్‌అలీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీవో ఎఫ్‌సీ బారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6: తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశపరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మోడల్ స్కూళ్లతో పాటు సదాశివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సామగ్రితో పాటు తమ పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే హాజరు కావాలని సూచించారు.

15న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ?

- చైర్‌పర్సన్ పీఠంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల గురి
- కాంగ్రెస్‌లో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆశీస్సులు ఎవరికో?
- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్ ఉరుదోండ వనితలో ఒకరికి ఛాన్స్ అంటూ చర్చ
- బీజేపీ సైతం చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాలు
- బీఆర్ఎస్ సహకారం కోరేందుకు సిద్ధమవుతున్న వైనం
- చైర్‌పర్సన్ ఎన్నికపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రత్యేక దృష్టి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న నిట్టు జాహ్నవిపై గత నెల 30న అవిశ్వాసం పెట్టి తీర్మాన కాపీని మున్సిపల్‌శాఖకు పంపిన విషయం విధితమే. అయితే ఈనెల 4న నిట్టు జాహ్నవిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. అయితే నూతనంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ ఈనెల 15న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల ప్రక్రియపై అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే నూతన చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంటుంది. బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌ను దింపేశామని ఇక తమ పార్టీలో ఎవరికో ఒకరికి చైర్‌పర్సన్ వస్తుందని ఆశతో ఉన్న కాంగ్రెస్ పార్టీలోని నాయకులకు చైర్‌పర్సన్ పీఠంపై బీజేపీ చేస్తున్న ప్రయత్నాలతో అయోమయానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టినప్పటి నుంచి బీజేపీ సైతం చైర్‌పర్సన్ పదవిని దక్కించుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. రెండు పార్టీల వారు ఒకరికి మించి ఒకరు ఎత్తులకు పై ఎత్తులు వేస్తు చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తున్నారు. అయితే ఈనెల 15న జరగనున్న చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఏ పార్టీకి కౌన్సిలర్‌లు మద్దతు పలికి చైర్‌పర్సన్‌ను ఎన్నుకుంటారో అనే దానిపై ఇరు పార్టీల నాయకుల్లో ఉత్కంఠ నెలకొంటుంది.

షబ్బీర్‌అలీ ఆశీస్సులు ఎవరికో?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి కామారెడ్డి మున్సిపాలిటీలో 9 మంది కౌన్సిలర్‌లు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 27కు చేరింది. ఇందులో ఆయా కౌన్సిలర్‌లను చేర్పించేందుకు 10వ వార్డు కౌన్సిలర్ ఉరుదోండ వనిత రవిలతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. పైగా అవిశ్వాసానికి 34 మంది కౌన్సిలర్‌లు ఉండాల్సి ఉండగా బీఆర్ఎస్ కౌన్సిలర్‌లతో సంప్రదింపులు జరిపి వారికి మద్దతు ప్రకటించేందుకు వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డిలు ఎంతో కృషి చేశారు. దీంతో ప్రస్తుతం వీరిద్దరు పేర్లు చైర్‌పర్సన్ పదవికై కాంగ్రెస్ శ్రేణుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. అయితే కొందరు కౌన్సిలర్‌లు ఇందులో ఒకరిని చైర్‌పర్సన్‌గా చేయడం తమకు ఇష్టం లేదని పార్టీ పెద్దల వద్ద తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారి అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకుని ఏ నిర్ణయం తీసుకుందామనే దానిపై చర్చించినట్లు వినికిడి. దీంతో ఈ ఇద్దరిలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆశీస్సులు ఎవరికి దక్కనున్నాయి. వీరిద్దరిని కాదని మరొకరికి అవకాశం కల్పిస్తారా అనేది మరికొన్ని రోజుల్లో తేలిపో నుంది.

మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు

కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు గత కొన్ని నెలలుగా అనేక కసరత్తులు చేసి అవిశ్వాసంతో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిను పదవి నుంచి దింపేశారు. ఇక తమ పార్టీకే చైర్‌పర్సన్ పదవి దక్కుతుందని ఆశలు పడుతున్న సమయంలో బీజేపీ అనూహ్యంగా వెలుగులోకి వచ్చింది. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని ఎలాగైన బీజేపీ ఖాతాలో వేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఆయన పోరాటాలు చేసిన విషయాలు తెలిసిందే. ఆయా విభాగాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసి దర్యాప్తు జరిపేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే సమయంలో మున్సిపల్‌లో అవినీతి, అక్రమాలు లేని పాలన ప్రజలకు అందిస్తానని హామీ ఇచ్చానని వాటికి అడ్డుకట్ట వేయాలంటే చైర్‌పర్సన్‌గా తన పార్టీకి చెందిన వ్యక్తి ఉండాలని ఆశిస్తున్నట్లు సమాచారం. ప్రజలకు న్యాయం జరిగేందుకు తాను ఎలాంటి పరిస్థితులనైన ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉంటానని చైర్‌పర్సన్ పీఠం దక్కేందుకు మీ ప్రయత్నాలు మీరు చేయాలని తన ఆశీస్సులు ఉంటాయని పార్టీ కౌన్సిలర్‌లకు చెప్పుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం తన పార్టీకి 6 గురు కౌన్సిలర్‌లు ఉండగా, తన ఎక్స్ అఫిషియో ఓటుతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్‌ల మద్దతు, కాంగ్రెస్‌లోంచి మరి కొందరు కౌన్సిలర్‌ల మద్దతు కోరేందుకు కసరత్తు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నాలు ఎంత వరకు సక్సెస్ అవుతాయి. చైర్‌పర్సన్‌గా అనుకున్నవారు పీఠం దక్కించుకుంటారా.. లేదంటే కొత్త వ్యక్తి చైర్‌పర్సన్‌గా అవుతారా అనేది వేచి చూడాలి.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ఇందల్వాయి, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో శనివారం సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఎస్సై మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు సైబర్ నేరాలపట్ల ఇందల్వాయి పోలీసులు, బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తుక్కుగూడ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ తుక్కు గూడ సభకు వెళ్లిన డిచ్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 6: రానున్న పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసిన హైదరాబాద్ తుక్కుగూడ సభకు డిచ్‌పల్లి మండలం నుంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 100మంది తరలివెళ్లారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలు చేసిన విధంగానే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యారెంటీలను అమలు చేస్తోందని అమృతాపూర్ గంగాధర్ అన్నారు. సభకు తరలిన వారిలో కూరపాటి గంగాధర్, కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, ధర్మగౌడ్,నవీన్ గౌడ్ తదిత రులు ఉన్నారు.

డ్రగ్స్ కేసులో అరెస్టు అయిన అధ్యాపకుడిని సమగ్ర విచారణ చేయాలి

● గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను నాయక్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 6: తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం సహాయ ఆచార్యుడు మత్తు పదార్థాల తయారీ పట్టుబడటం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతునట్లు ఇటీవల వచ్చిన వార్త కథనాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి స్థాయి విద్యార్థులు చదువుకుంటున్న యూనివర్సిటీలో ఇలాంటి ఘటనలు జరగడం మాయని మచ్చలాంటిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, ఈ ఘటనలో ఏవ రెవరు పాత్ర ఉందో నిగ్గు తేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా మహాపూజ

ధర్పల్లి ఏప్రిల్6: మండంలోని కాలేజ్‌తండాలో హన్మాన్ భక్తులు మహాపూజలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహాపూజకు ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి సిరికొండ మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గణపతిపూజ, హన్మాన్ పూజ, యజ్ఞం నిర్వహించారు. హన్మాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు భక్తులు కాలినడకన వెళ్లనున్నారు. ప్రతీరోజు మాలధారులైన హన్మాన్ భక్తులు నియమనిష్టలతో పూజలు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో స్వాములు కమ్మరి గంగాధర్, నరేష్, వీరేందర్, రాజా, భక్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ధర్పల్లి ఏప్రిల్6: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్ అన్నారు. శనివారం పాఠశాలలోని విద్యార్థులను ఉచితంగా ఒక రోజు విహారయాత్రకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పోచంపాడ్ జల విద్యుత్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తిపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిర్మల్‌లో చెక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని తీసుకువెళ్లి చెక్కబొమ్మల విశిష్టతను వివరించారు. పాఠశాలకు చెందిన ఆరు నుంచి 9తరగతి విద్యార్థులను విహారయాత్రకు తీసుకువెళ్లినట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్ కోర్టు ప్రాంగణంలో శనివారం చట్టాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు బోధన్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌రావు, డాక్టర్ సమ్మయ్య, బోధన్ సీఐ వీరయ్య, రూరల్ సీఐ పోల నరేష్, రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి, బోధన్ ఎక్సైజ్‌ఎస్‌ఐ ఎండీ జలీలుద్దీన్,ఎడపల్లి ఎస్‌ఐ వంశీకృష్ణ, రుద్రూర్ ఎస్‌ఐ అప్పారావు, రెంజల్ ఎస్‌ఐ సాయన్న, వర్ని ఎస్‌ఐ కృష్ణకుమార్, అటవీ శాఖ అధికారి కే.బాబు, లైసెనింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

కోటగిరి,ఏప్రిల్6: పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు, పాఠశాల విద్యార్థులకు శనివారం వడదెబ్బ నివారణపై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా పని చేయాలన్నారు. డీహైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు నీటిని తాగాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఎండలో తిరగకుండా, ఆటలు ఆడకుండా ఉండాలని సూచించారు. మాధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఇంటిలోనే ఉండాన్నారు. వడదెబ్బవల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. ఎక్కువగా నీటిని సేవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌గౌడ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: రాజ్యాంగాన్ని మార్చే వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. శనివారం జక్రాన్‌పల్లిలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు మనువధులు రాజ్యంగం స్థానంలో మధుదర్మ రాజ్యంగాన్ని తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలమహ నాడు అధ్యక్షుడు కిరణ్, నిజామాబాద్‌రూరల్ అధ్యక్షుడు గంగారాం, మాలమహనాయడు నాయకుడు భాస్కర్, మాణిక్యం, దిలీప్, గంగారాం, బుయ్య గంగన్న, హరిష్, సోలమన్, తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుడాలి : ఎస్‌ఐ

మోపాల్, ఏప్రిల్ 6:యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని మోపాల్ ఎస్సై గంగాధర్ అన్నారు. శనివారం మోపాల్ మండల కేంద్రంలో కెంపు అశోక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని అశోక్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఒక్క వాటర్ బాటిల్ కొనాలంటే రూ.20 అవుతుందని తెలిపారు. మోపాల్ మండల కేంద్రానికి వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నందున గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కూడా అశోక్‌ను స్ఫూర్తిగా తీసుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, గణపతి, కెంపు సాయిలు, కెంపు సతీష్, ప్రవీణ్, సాయరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సంతోష్, లక్ష్మీనర్సయ్య, చిన్నయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

సిరికొండ ఏప్రిల్ 6 : గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆచరణలో అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. సిరికొండ మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల సన్నాహ సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు చేరువయ్యిందన్నారు. బీఆర్ఎస్‌ను అందులో బలమైన నాయకుడు కేసీఆర్‌ను ఓడించాలంటే ప్రజలు నమ్మె హామీలను ప్రకటించాలని భావించి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రైతులకు ఎకరాన పదిహేను వేలు వేయడం పక్కన బెడితే ఐదెకరాల లోపు రైతులకు రైతుబంధు వేయడానికై అపసోపానాలు పడుతున్నరని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్, మాజీ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.జీ. గౌడ్ , జడ్పీటీసీ సభ్యులు బాజిరెడ్డి జగన్, మాజీ జడ్పీటీసీ సభ్యులు బేల్దారి గోవర్ధన్, గంగారెడ్డి,రాజగంగయ్య,మంజుల,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

● ఎంపీడీవో గోపాల కృష్ణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దృశ్యం

ఎడపల్లి, ఏప్రిల్ 6: వేసవి కాలంలో మండల ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి గోపాల కృష్ణ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోగల ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన ఏఏ గ్రామాలలో తాగునీటి సమస్య ఉందో, మిషన్ భగీరథ నీరు ఎంతమేర వస్తుందోనని, ఏఏ గ్రామాలలో నీటి ఎద్దడి ఉందో పంచాయతీ కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడతూ మండలంలో ముఖ్యంగా ఐదు గ్రామాలకు నీటి కొరత ఉందని, ఆ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు కొన్ని సాంకేతిక కారణాల వల్ల సరఫరా కావడంలేదని ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా బోరు మోటారులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏఏ గ్రామాలలో మిషన్ భగీరథ నీరు తక్కువగా వస్తుందో ఆ గ్రామాల కార్యదర్శులు మిషన్ భగీరథ ఏఈతో మాట్లాడి డిమాండ్ ప్రకారం గ్రామానికి నీటి సరఫరా అయ్యే విదంగా చూడాలన్నారు. బోరు బావులు అందుబాటులో లేని గ్రామాలలో గ్రామానికి దగ్గరగా ఉన్న రైతులతో మాట్లాడి వారి బోరు మోటారు ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అలా ముందుకు వచ్చిన రైతులకు బోరు మోటారుకు అద్దె ప్రభుత్వం చెలిస్తోందని ఆయన సూచించారు. అంతకు ముందు మండల ప్రత్యేక అధికారి నంద కుమారితో కలిసి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం, ధర్మారం గ్రామాల్లో జరుగుతున్న నీటి సరఫరా, ట్యాంకుల సామర్థ్యం, వాటి నిర్వహణ, ఆయా గ్రామాల కార్యదర్శులను, నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ వాటర్ సర్వీస్ ఏఈ గబ్బర్ సింగ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, ఉదయ భాస్కర్, సాయి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్ ఇస్తారి, తదితరులు ఉన్నారు.

రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

● వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



రోగులతో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్6: రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అన్నారు. శనివారం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యుల సేవలు ఎలా ఉన్నాయంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలని విధుల్లో తప్పకుండా హాజరుకావాలన్నారు. రోగులకు మానవత దృక్పదంతో వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో ప్రేమగా మాట్లాడి రోగాల నయం కోసం కావాల్సిన మందులను అందజేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు తాగునీరు అందించేందుకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలోని డయాలసిస్ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్‌బ్యాంక్‌లో అవసరమైన అన్ని రకాల గ్రూప్ రక్తాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. చిన్నారులకు ప్రత్యేకమైన వైద్య సేవలందించాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందు వైద్యులు విధులు నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వైద్య సిబ్బంది ఎటువంటి సెలవులు తీసుకోకుండా రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సదుపాయలను రోగులకు తప్పకుండా అందించి వారి ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శివశంకర్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్, ఆర్ఎంవో డాక్టర్ రహీమ్, డాక్టర్ సందీప్, డాక్టర్ బల్‌వీర్‌సింగ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్, సాలూర మండలాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ్ కుమార్, కృష్ణవేణిలు అన్నారు. శనివారం బోధన్ మండల పరిషత్ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని, వేసవిలో ప్రజలకు తాగునీటిలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి ప్రతి రోజు ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సాయిబాబా

కోటగిరి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో కార్యదర్శులపై చర్యలు తప్పవని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా హెచ్చరించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు నెలల పాటు గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలలో అవసరమైతే వ్యవసాయ బోరు మోటార్లు వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైతే తప్ప కార్యదర్శులు సెలవులు పెట్టరాదని సూచించారు. తాగునీటి సమస్యతో పాటు గ్రామాలలో పారిశుధ్య సమస్యలపై తగిన దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతీ తదితరులున్నారు.

మోపాల్:గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ఈ సమస్య రాకుండా గ్రామస్థాయి అధికారులు చూడాలన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రత్యేక అధికారులు నీటిసమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధర్పల్లి: గ్రామాల్లో నీటి కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలం లోని మద్దుర్‌తండాలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తండావాసులను తాగునీరు సరఫరాపై అడిగితెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మంచి నీటి సరఫరాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కావొద్దని ఆయన తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భూగర్భజలాలు అడుగంటిన పరిస్థితుల్లో కార్యదర్శులు స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ మాలతి, వ్యవసాయాధికారి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎండ కాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

రుద్రూరు: ఎండకాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శశికళ ఆదేశించారు. రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో శనివారం వాటర్ ట్యాంకులను పరిశీలించారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీటి సమస్య ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: వేసవి కాలం ముగిసే వరకు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి. ఎంపీవో యుసుఫ్‌ఖాన్, గ్రామప్రత్యేక అధికారులు, పంచాయతీకార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఎండలు మండుతున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమ్మర్‌పల్లి మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డివో పీడీ సాయాగౌడ్ ఆదేశించారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో మండల గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరత అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ మాట్లాడుతు గ్రామాలలో తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి సారిస్తూ పైప్‌లీకేజీలు ఎప్పటికప్పుడు సరిచేస్తూ ప్రతి వార్డులో ఇంటింటికి తాగునీరందేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమాత్ర నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉంటాయని సూచించారు. సమావేశంలో ఎంపీ రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, మండలస్థాయి అధికారులు, మండల పంచాయితి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● నాగాపూర్ గ్రామాన్ని సందర్శించిన పీడీ

మండలంలోని నాగాపూర్ గ్రామాన్ని కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్ వడ్డర కాలనీలను డిఆర్‌డివో పిడి సాయాగౌడ్ సందర్శించి పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయమై గ్రామస్థులు కాలనివాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ నర్సరీలను ఆయన పరిశీలించారు.

కర్షక్ మిత్రను సద్వినియోగం చేసుకోవాలి

ధర్పల్లి ఏప్రిల్6: కర్షక్ మిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ ధర్పల్లి శాఖ మేనేజర్ కాశీనాథ్ శనివారం తెలిపారు. కర్షక్ మిత్ర పథకంలో భాగంగా రైతులకు ఎకరానికి రూ.లక్షన్నర చొప్పున ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రూ.10లక్షలకు మించకుండా ఈ పథకాన్ని రైతులకు వర్తింపజేయనున్నట్లు ఆయన తెలిపారు. తమ బ్యాంకులో హౌజింగ్‌లోన్‌లు సైతం ఖాతాదారులకు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. మండల కేంద్రంలో రూ.30లక్షల వరకు, గ్రామీణ ప్రాంతంలో రూ.25లక్షల మేరకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.


పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఏప్రిల్6: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ సీఐ నాగనాథ్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని పెద్ద మావంది గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. మండలంలోని గ్రామాలలో పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో పంచవటి సూపర్ మార్కెట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మృతదేహన్ని జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతదేహనికి సుమారు 35సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహన్ని గుర్తించిన వారు బోధన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతి గల కారణాలను అన్ని కోణాల్లో సీసీ పుటేజీల ద్వారా విచారణ చేపడుతున్నామన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరి



డొంకేశ్వర్‌లో పశువులకు టీకా వేస్తున్న మండల పశువైద్యాధికారి

డొంకేశ్వర్ ఏప్రిల్6: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని డొంకేశ్వర్ మండల పశువైద్యాధికారి హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని, ఈ వ్యాధి సోకిన పశువులకు నోటీలో, కాళ్లలో, పండ్లు ఏర్పడి మేతమేయక నడవలేక నిరసిస్తాయన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందని, వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కిష్టయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు తప్పవు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: మండలంలో 44వజాతీయరహదారిపై, ఇతర రహదారులపై ధాన్యం ఆరబెట్టి వాహనదారులకు ఇబ్బంది కలుగజేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సిహెచ్.తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దని, కల్లెంలో ధాన్యంను ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి,ఏప్రిల్ 6:స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వ ర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ ఇస్తు న్నట్లు ఇందుకోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నమని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నిరు ద్యోగ గ్రామీణ ప్రాంత మహిళలు, నిరు ద్యోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు. పురుషులకు సెల్‌ఫోన్ రిపేర్, ఎలక్ట్రీషియన్, కారు డ్రైవింగ్ మెకానిక్, ఫొటో మరియు వీడియోగ్రఫీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు 19-45 ఏళ్ల వయస్సు కలిగి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గ్రా మీణ ప్రాంతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవ డానికి డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో ఆధార్, రేషన్, ఎస్సెస్సీ, పత్రాల నకళ్లు, 5 పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈఉచిత శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి ఉంటుందన్నారు.మరిన్ని వివరాలకు 08461-295428 నంబరుకు సంప్రదించాలని డైరెక్టర్ కోరారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కమ్మర్‌పల్లిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళానాన్ని విజయవంతం చేయాలని ఏర్గట్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడతూ ఏర్గట్ల మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు తరలిరావాలని, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ కార్యకర్త బీఆర్ఎస్ ఎంపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బద్దం ప్రభాకర్, నాగిరెడ్డి రాజేంధర్, ఓర్సు రాములు, రాజారం సహదేవ్, నర్సయ్య, ఎలేటి బాలకిషన్‌లు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ బంజారా గిరిజన ఆత్మీయ సదస్సు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 6: బర్ధిపూర్ శివారులోని బృందావనం గార్డెన్‌లో నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా బంజార గిరిజన ఆత్మీయ సదస్సు జరగనుందని మండల కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి మండ వ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ తేజావత్ బెల్ల య్య నాయక్‌లు హాజరువుతున్నట్లు వారు పేర్కొన్నారు. కావునఈ కార్యక్ర మానికి నిజామాబాద్‌రూరల్ గిరిజన సోదరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

పలు వార్డుల్లో భూగర్భజలాల పరిశీలన

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్6: మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో శనివారం ము న్సిపల్ కమిషనర్ రాజు భూగర్భజలాలను పరిశీలించారు. పలు వార్డుల్లోని ప్ర భుత్వ బోరుబావులను పరిశీలించి కాలనీలోని ప్రజలను నీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు, సిబ్బంది శ్రీనివాస్, తదిత రులు ఉన్నారు.

ఏర్గట్లలో ఓపీవోలకు ఎలక్షన్ శిక్షణ

ఏర్గట్ల, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఓపీవోలకు ఎలక్షన్‌కు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ ఓపీవోలకు ఎలక్షన్ బూత్‌లో నిర్వహించాల్సిన విధులపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ సదానంద్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఈజీఎస్, ఐకేపి ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండారంలో "ఉగాది బాల కవిసమ్మేళనం"

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 6: రూరల్ మండలం గుండారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. శనివారం పాఠశాలలోని విద్యార్థులకు క్రోధినామ నూతన సంవత్సరం సందర్భంగా బాల కవి సమ్మేళనం నిర్వహించారు. మామిడి తోరణాలు, ఉగాది పచ్చళ్ల మధ్య పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా తరగతి గదులను తీర్చిదిద్దారు. 9వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులు లాస్య, కృష్ణవేణి, నిహారిక, శ్రుతిరెడ్డి, సంజన, ఇందు, సాత్విక, గంగాలక్ష్మి, నందిత, లక్షయ, శ్రీవేణి, వైశాలి తదితర విద్యార్థులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఉత్తమ కవితలు చదివిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ దస్తగిరి, డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, జి.అమర్‌నాథ్, శ్రీపాద, గిరిధర్, ఆరోగ్యరాజ్, వినోద్‌కుమార్, నాందేవ్, పుష్పలత, మోనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి



ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బోధన్‌రూరల్,ఏప్రిల్6: ఎన్నికల నియమ, నిబంధనలు తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని బోధన్ తహసీల్దార్ గంగాధర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై ఉపాధ్యాయులు పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని సూచించారు. పోలింగ్ నిర్వహించే విధానంతో పాటు సంబంధిత శిక్షణలో భాగంగా పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వరుణ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధుల పట్ల నిర్లక్ష్యంచేస్తే చర్యలుతప్పవని తహసీల్దార్ కిరణ్మాయి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఓపీవోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో అధికారులు తప్పనిసరిగా తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలపై ఓపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ ప్రవీన్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మోర్తాడ్‌కు ఎంపీ సురేష్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రాక

మోర్తాడ్, ఏప్రిల్6: మండలంలోని మోర్తాడ్ గ్రామశివారులోని లలిత గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక ముఖ్యకార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ప్రస్తుత ఎంపీ కేఆర్.సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లతో పాటు ఇతర నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి మండలంలోని నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు

జంబి హన్మాన్ ఆలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్6: పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ప్రతీ శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోర్త దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అన్నదానంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాన్సువాడలో ఇఫ్తార్ విందు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 6: పట్టణంలోని భారత్‌గార్డెన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దావతే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారని మైనార్టీ నాయకులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఇఫ్తార్ విందులో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌లు పాల్గొంటున్నారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని మైనారిటీలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మిర్జాపూర్ విండో చైర్మన్ రాజీనామా

బీర్కూర్, ఏప్రిల్ 6: మండలంలోని వీరాపూర్ గ్రామ పరిధిలోని మిర్జాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు మారుతి తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పలు సహకార సంఘాల చైర్మన్‌లపై అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఇందులో భాగంగా మిర్జాపూర్ సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా కొన్ని కారణాల వల్ల పుట్ట సాయిరాం అనే డైరెక్టర్ సంవత్సరం క్రితం రాజీనామా చేశారు. మిగిలిన 13 మంది డైరెక్టర్‌లలో 10 మంది ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధ్యక్షుడిపై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. 6వ తేదీన అవిశ్వాసం ఉండటంతో మారుతి (5వ తేదిన) శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేసినట్లు సీఈవో జాకీర్ తెలిపారు. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్ చైతన్య కృష్ణకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు

బీర్కూర్, ఏప్రిల్ 6: మండలంలోని భైరాపూర్ గ్రామంలోని స్థానిక హనుమాన్ ఆలయ సన్నిధిలో శనివారం హనుమాన్ స్వాములకు అంగీర్గ పద్మ, విఠల్‌గౌడ్ దంపతులు మండల భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. హనుమాన్ ఆలయంలో అంజన్న స్వామి వారికి అభిషేకం చేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వాములు భిక్షను స్వీకరించారు. దాతలు స్వాములకు పండ్లు పంపిణీ చేశారు. హనుమాన్ గురు స్వాములకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బీర్కూర్‌లో ఓపీవోలకు ప్రత్యేక శిక్షణ

బీర్కూర్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓపీవోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సిబ్బంది విధులు, బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందు కోసం పోలింగ్ బూత్‌లోకి వచ్చే వారికి గుర్తింపు కార్డులు ఉన్నాయా లేవా సరిగ్గా పరిశీలించడం, సంతకాలు చేయడం, బ్యాలెట్ పేపర్ అందించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓపీవోలు ఉన్నారు.

ఎల్లారెడ్డి: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఓపీవో అధికారులకు, పోలింగ్ అధికారులకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ శనివారం ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్నికల నిర్వహణ ఈవీఎం, వీవీ ప్యాడ్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నే ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, ఎన్నికల అధికారులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి 370 ఎంపీ సీట్లు ఖాయం'

బీర్కూర్, ఏప్రిల్ 6: బీర్కూర్ మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలో పార్టీ జెండాను బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయి కిరణ్ ఆవిష్కరించారు. టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీకి 370 ఎంపీ స్థానాలు వస్తాయని, ఎన్‌డీఏ కూటమి 400లకుపైగా స్థానాలు సాధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బూత్ స్థాయి కార్యకర్తలు బీజేపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి యోగేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి లింగపురం రవి, సాయిబాబా, లింగారామ్, శ్రీనివాస్, చరణ్, కళ్యాణ్, నవీన్, బస్వరాజ్, శంకర్, నామ్దేవ్ పటేల్, గజేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీరు పట్టాలి

పిట్లం, ఏప్రిల్ 6: మండలంలోని ప్రతీ గ్రామంలో నర్సరీల్లో మొక్కలు ఎండకుండా సమయపాలన ప్రకారం నీరు పట్టాలని సిబ్బందికి ఎంపీడీవో కమలాకర్ సూచించారు. శనివారం రాంపూర్, గౌరారం ఆయా గ్రామాల్లో నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉన్నాయని నర్సరీల్లో పెట్టిన మొక్కలు ఎండిన వాటిలో కొత్తవి పెట్టడం, ఎండ తగల కుండా నీడ కోసం చల్లని పందిర్లు వేయిస్తున్నామని తెలిపారు. ఉపాధిహామీ పనులను ఆయా గ్రామాల్లో పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయించాలని, హాజరు పట్టికలను పరిశీలించి, కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, ఫీల్డ్‌అసిస్టెంట్ అంజయ్య, కార్యదర్శులు ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్షలు జరగగా బాన్సువాడ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన దీక్షల్లో పాల్గొన్న పోచారం మాట్లాడారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, 2 లక్షల రుణమాఫీ అమలు చేయడం లేదని, క్వింటాలు వరి ధాన్యంకు 5 వందల బోనస్‌తో పాటు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ అవగాహన లోపంతో రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో తారుమారు జరుగుతుందని, ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి జరిగిందని, నియోజక వర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టించానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పోచారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాన్సువాడలో నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలి

జుక్కల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న హన్మంత్‌షిండే

పిట్లం, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు మోసపూరిత మాయ మాటలు చెప్పి అధికారంలోనికి రావడం జరిగిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జుక్కల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. శనివారం పిట్లంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం చుపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో రైతులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబీమా, రైతు బంధు, ఉచిత విద్యుత్ ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఆదుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రైతులకు విద్యుత్ సమస్య తలెత్తిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ దఫేదార్ రాజు, నియోజకవర్గ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

క్వింటా వరిపై రూ.500 బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జాజాల సురేందర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులకు 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని, అదే విధంగా వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు మద్దతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతనే ఓట్లు అడగాలని అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యం కావడం లేదని, కరెంట్ కోతలతో రైతులు పంటలు నష్టపోతున్నారని, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆది మూలం సతీష్‌కుమార్, సొసైటీ చైర్మన్‌లు నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి వినోద్‌కుమార్ గెలుపునకు మద్దతుగా శనివారం రెండు ప్రచార రథాలను మాజీ ఎమ్మెల్యే సురేందర్ ప్రారంభించారు. అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త పని చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ

బాన్సువాడటౌన్, ఏప్రిల్6: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ కుటుంబ సభ్యులు అన్నదాతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని, అందుకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి గురువినయ్, ర్యాల విఠల్‌రెడ్డి, భక్తులు తదితరులున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాచారెడ్డి, ఏప్రిల్6: మండలంలోని గ్రామాల్లో పంట పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పొలాల వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లు, మోటార్లలో ఉండే కాపర్ వైర్లు దొంగిలించడానికి కొంత మంది ముఠాగా ఏర్పడి చోరీకి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పంటపొలాల వద్ద ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరుతున్నారు.

రెండు గ్రామాల్లో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ

లింగంపేట, ఏప్రిల్6: మండలంలోని పర్మల్ల, శెట్పల్లి గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. పర్మల్లకు చెందిన రాజిరెడ్డిగారి అంజిరెడ్డి, అతని తమ్ముడు వెంకట్‌రెడ్డి, శెట్పల్లికి చెందిన ఈర్ల గణేష్, రాజులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా రాత్రి దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లోని బీరువా తలుపులు పగుల గొట్టి అందులోని బంగారం, వెండితో పాటు నగదును దోచుకుపోయారు. అంజిరెడ్డికి చెందిన 2.5తులాల వెండి, వెంకట్‌రెడ్డికి చెందిన రూ.15వేల నగదు, ఈర్ల గణేష్‌కు చెందిన 50 తులాల వెండి, 14 గ్రాముల బంగారం, రూ.20 వేలు, ఈర్ల రాజుకు చెందిన 4గ్రాముల బంగారం, రూ.10వేల నగదు దోచుకుపోయారని ఆయన తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

నేడు భిక్కనూరులో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

భిక్కనూరు, ఏప్రిల్6: భిక్కనూరు మండలకేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి భిక్కనూరు మండల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పార్టీ మండల అప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనీల్‌కుమార్ హాజరవుతారని, ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఆ సమావేశానికి ఉమ్మడి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్6: కామారెడ్డికోర్టు సముదాయంలో శనివారం నూతన చట్టాలపై పోలీసులకు పీపీలు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రతీనెల మొదటి శనివారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు సాధారణ సమావేశం నిర్వహించి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌కి నూతన చట్టాలపై అన్నిరకాల సందేహాలను నివృత్తిచేయడంతో పాటు చట్టాలకు అనుగుణంగా ఏ విధంగా ఉండాలనే దానిపై వివరించినట్లు పీపీలు తెలిపారు. చట్టాలపై పూర్తి అవగాహ కలిగి ఉన్నప్పుడే బాధితులకు న్యాయం చేయగలరని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాంనాయక్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిమ్మదామోదర్‌రెడ్డి, శేషు, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, భిక్కనూర్ సీఐ సంపత్, సబ్ డివిజన్ ఎస్ఐలు, లైసనింగ్ ఆఫీసర్లు శ్రీరాం, హన్మండ్లు, అలిమోద్దీన్ తదితరులు ఉన్నారు.



కార్యకర్తలతో కలిసి టిఫిన్ బైటాక్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైటక్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్6: బీజేపీలో ప్రధానమంత్రి నుంచి కార్యకర్త వరకు అంతా ఒకే కుటుంబమని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని 215వ బూత్ పరిధిలో కార్యకర్తల మధ్య సోదరభావం పెంపొందించేందుకు టిఫిన్‌బైటాక్ లాంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నిగ్రామాలు, వార్డులలో కార్యక్రమాలు చేపట్టి కార్యకర్తలతో కలిసి భోజనాలు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నిజాంసాగర్, ఏప్రిల్6: మండలంలోని ఆరేడు గ్రామానికి చెందిన రమేష్ (28) తాగుడుకు బానిసై శనివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించామన్నారు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తాడ్వాయి, ఏప్రిల్6: మండలంలోని చిట్యాల శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి రూ.49810 నగదు పట్టుకున్నట్లు తెలిపారు. రవి, శ్రీనివాస్‌రెడ్డి, భద్రు, రాజు, సుహాష్, సీరాజ్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



బీర్కూర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మన గ్రోమోర్ కేంద్రంపై చర్యలు తీసుకోండి

● తహసీల్దార్‌కు రైతుల వినతి

బీర్కూర్, ఏప్రిల్ 6 : నకిలీ విత్తనాలు అంటగట్టి తమను నిండా ముంచిన మన గ్రోమోర్ కేంద్రం, సీడ్ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులు డిమాండ్ చేశారు. శనివారం రైతులు పెద్ద ఎత్తున బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బీర్కూర్‌లోని మన గ్రోమోర్ కేంద్రంలో సుమారు 300 మంది రైతులు వరి విత్తనాలను కొనుగోలు చేసి పంటలను పండించారని తెలిపారు. ఆనాడు గ్రోమోర్ వారు 120 రోజుల్లో పంట కోతకు వస్తుందని నమ్మబలికారన్నారు. ప్రస్తుతం కోతలు కొనసాగుతున్నాయని, కాని తాము పండించిన పంటలు మాత్రం కోతకు రాలేదన్నారు. దీనికి తోడు వరి కంకులు పొల్లుపోయాయనిన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్షలు

ముద్నూర్, ఏప్రిల్ 6: మద్నూర్ మండలం మేనూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఈ నెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 6వ తరగతి వరకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7వ తరగతి, 10వ తరగతి ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. హాల్ టికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని రావాలన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను శనివారం జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రతీ సామాన్యుడి నమ్మకాన్ని చూరగొంటోందని అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదుల ద్వారా ఆవిర్భవించి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 400కు పైగా సీట్లు పొంది ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాచారెడ్డి: మాచారెడ్డి, పల్వంచ మండలాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం టిఫిన్ బైటాక్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, తోట బాలరాజు, శ్రీనివాస్, నరేష్, కట్ట భాస్కర్, ఉమాపతిగౌడ్, సత్యం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీపేట: మండలంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల కోసం ప్రతీ కార్యకర్త పనిచేయాలని పేర్కొన్నారు. దేశం కోసం, ధర్మం కోసం నమ్మిన సిద్ధాంతం కోసం ఉంటూ అనునిత్యం పార్టీ అభ్యున్నతి కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌,రాజు, కుమార్‌గౌడ్, ధర్మారెడ్డి, రమేష్‌శ్రీనివాస్, సందీప్‌రాజు, బాపురెడ్డి, దేవరాజ్, రవి, కిషోర్‌శ్రీకాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాసాగర్ గ్రామంలో..

ఎల్లారెడ్డి: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బూత్ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దేశాలలోని భారతదేశ ఖ్యాతిని పెంచేలా పరిపాలన చేసినటువంటి పార్టీ వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్, పీకే బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేందర్, సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, పరువయ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించి సాముహిక టిఫిన్ చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ బీజేపీలో ప్రధాని నుండి మొదలు సామాన్య కార్యకర్త వరకు అందరం ఒకే కుటుంబసభ్యులమని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నిగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జనగామ ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. 2019 ఎన్నికల్లో 303 స్థానాలు గెలిచిందని ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో 370 పైచిలుకు స్థానాలు సాధించి మరోమారు నరేంద్రమోదీ ప్రధాని అవుతారని తెలిపారు.



జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- ప్రాజెక్ట్(జడ్)
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్

బాన్సువాడ	
మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- మంజుమ్మల్ బాయ్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

